అమ్మమ్మ

అన్నపూర్ణ అమ్మమ్మ నెరుగుదు. ఆవిడ డెబ్బయి రెండేళ్ళు బ్రతికి, అన్నపూర్ణ ఆరేడేళ్ళపిల్ల అయివుండగా పోయింది. ఆవిడ చచ్చినప్పుడందరూ ఆశ్చర్యంగా చెప్పుకున్నారు. యోగులకు వచ్చే చావన్నారు. ఆవిడకు జబ్బు చెయ్యలేదు. మంచాన్నపడి తీసుకోలేదు. ఒకనాడు మధ్యాహ్నము భోజనాలయాక. "నేను పడుకుంటున్నాను. పలకరించకండర్రా" అని పీట తలకింద పెట్టుకుని వసారాలో పడుకుంది. మళ్ళా లేవలేదు. సూర్యాస్తమయం లోపల దహనం కూడా అయిపోయింది.

అన్నపూర్ణకు అమ్మమ్మకన్న అమ్మే ఎక్కువ ముసలిదిగా కనబడేది. అమ్మమ్మకు ఒక్క పన్నూ ఊడలేదు. చత్వారం వచ్చి పోయిందట. సూదిలో దారం ఎక్కించేది. ఒక్క చెవుడు మాత్రం వుండేది. కాని ఎవరన్నా అరిస్తే మండిపడేది. మెల్లగా మాటాడితే తెలుసుకునేది. అమ్మమ్మకు కళ్ళు కనపడవు. పళ్ళు చాలా భాగం ఊడిపోయినై. శుక్లాలుతీసి కళ్ళజోడు పెట్టినాక అమ్మమ్మ కూ్కడా కళ్ళు వచ్చినై. కాని తరువాత కొద్దిరోజులకే పక్షవాతం వచ్చి మంచానపడి తీసుకున్నది.

ఒకనాడు అమ్మ సందుకాయపెట్టెలో వస్తువులేవో సర్దుతుంటే అందులో ఒక ఫొటో కనిపించింది. ఆ ఫొటోలో అమ్మమ్మ అమ్మమ్మను ఒళ్ళోపెట్టుకుని కూచుని ఉంది. ఆ ఫొటోకేసి కాస్సేపుచూచి తనలోతాను నవ్వుకుంటూ "ఆ రోజుల్లో ఏంపి నగలు పెట్టుకునేవాళ్ళో !" అన్నది అమ్మ.

"ఏదమ్మా నన్ను కూడా చూడనియ్యవూ ?" అంటూ అన్నపూర్ణ అమ్మ చేతిలోనుంచి ఫొటో తీసుకుంది. అమ్మ చెబితే నమ్మాలిసిందేగాని ఆ ఫొటోలో అమ్మమ్మ గుర్తుపట్టేట్టు లేదు. ముక్కుకు పుడకలూ, బులాకీ, చెవులకు దుద్దులూ, పుడకలూ, మెళ్ళోకంటే, నానుపట్టెడా, జిగిని గొలుసూ, నడుముకు మువ్వా వడ్డాణమూ, చేతులకు మురుగులూ, దండకడియాలూ, కాళ్ళకు అందెలూ, కడియాలూ, మట్టెలూ ఉన్నై.

"ఈ ఫొటో తీసినప్పుడు అమ్మమ్మ కెన్నేళ్ళుంటాయమ్మా ?" అని అడిగింది అన్నపూర్ణ.

"పద్దెనిమిదో, పందొమ్మిదో ఉండవూ? అమ్మమ్మకి అయిదో ఏడు" అన్నది అమ్మ.

అదీ నమ్మశక్యంగాలేదు. అమ్మమ్మ నలభై ఏళ్ళదానిలాగా కనబడింది అన్నపూర్ణ కళ్ళకి. అమ్మమ్మ వళ్ళోకూచునే పిల్లలాగాలేదు. తనలాగే ఏ పదేళ్ళదో అనిపిస్తున్నది. తను ఇప్పుడు అమ్మ ఒళ్ళో కూచుని ఫొటో తీయించుకుంటే ఏమన్నా బాగుంటుందీ?

అన్నపూర్ణ ఆ ఫొటోను తీసుకుపోయి నాన్నకు చూపించింది.

"ఎక్కడ దొరికిందే ఇదీ? ఈమధ్య కనిపించకపోతే పోయిందనుకున్నా" అన్నాడు నాన్న.

ఇంతలో రాములన్నయ్య వచ్చాడు. "ఏమిటీ నాన్నా, అదీ?" అంటూ ఫొటో తీసుకున్నాడు. కాస్సేపు దానికేసిచూచి, "అమ్మమ్మా, అమ్మమ్మాకాదూ?" అన్నాడు.

"అవునన్నయ్యా. అమ్మ చెప్పింది. ఈ ఫొటోతీసి ఎన్నేళ్ళయిందంటావ్?" అన్నది అన్నపూర్ణ.

"అమ్మమ్మకి అయిదేళ్ళని కాబోలు చెప్పింది. అంటే 1898లో తీశారన్న మాట. తస్సాదియ్యా. అప్పటి ఫొటోగ్రాఫర్లే నయం. హైపో చక్కగా కడిగే వాళ్ళు. పీ.ఓ.పీ. పేపరయినా ఫొటో చూడు చెక్కు చెదరకుండా ఎట్లా ఉందో!" అన్నాడు అన్నయ్య.

"ఇదిగో పురుగు తినేస్తున్నది" అంటూ అన్నపూర్ణ ఒకమూల తినేసిన భాగం చూపించింది.

"అది ఫొటోగ్రాఫర్ తప్పుకాదు. మన తప్పు. దీన్ని రీ కాపీ చేయించి ఎన్‌లార్జి చేయిద్దాం. ఇట్లా ఇచ్చెయ్యి" అన్నాడు రాములన్నయ్య. అంతే ఆ తర వాత ఆ ఫొటో మళ్ళీ ఎవరికీ కనిపించలేదు.

* * *

అమ్మమ్మ పేరే పెట్టారు అన్నపూర్ణకు. అందుచేతనో, మరెందుకోగాని అమ్మమ్మను గురించి ఎవరేం చెప్పుకుంటున్నా అన్నపూర్ణ శ్రద్ధగా విని జ్ఞాపకం పెట్టుకునేది.

అమ్మ ఒకసారి అన్నది.... అమ్మమ్మ ఎన్నడూ గుడికిపోయిగాని దేవుడికి దణ్ణం పెట్టుకునిగాని ఎరగదట. ఆవిడ జీవితం దేవుడితో నిమిత్తంలేకుండానే జరిగిపోయింది.

ఒకసారి అమ్మ అమ్మమ్మని నిలవదీసి అడిగిందట.... "ఏం అమ్మమ్మా? నీ ఉద్దేశం దేవుడున్నాడనా, లేడనా?" అని అమ్మ అడిగితే "అందరూ ఉన్నా డనే అంటున్నారుగాదుటే! నేను మాత్రం చూచానూ?" అన్నదట. "అయితే నువు ఏడాది కొకసారన్నా గుడికిపోవేం?" అని అమ్మ అడిగిందట. "నాకు తీరికేదే" అన్నదట అమ్మమ్మ.

అయితే అమ్మమ్మకుమటుకు దేవుడంటే చాలా భక్తి. ఏవో స్తోత్రాలు చదివేది; ఏవేవో పూజలు చేసేది; పురాణాలు వినబోయేది; తరుచు గుడికివెళ్ళేది.

అమ్మమ్మకు లేని దైవభక్తి అమ్మమ్మకెట్లా వచ్చిందని అన్నపూర్ణ ఆశ్చర్యపడేది. అమ్మమ్మ మిన్ను విరిగి మీదపడినా చలించకుండా రాయల్లే ఉండేది. అమ్మమ్మకు ఎప్పుడూ దేన్నిగురించో ఆందోళనే.

అమ్మ మరోరకం. పూజలూ, స్తోత్రాలూ, గుడిప్రదక్షిణాలు లేవుగాని అమ్మకు దేవుడంటే నమ్మకం ఉంది. భయంకూడా ఉంది. ఒకసారి రాములన్నయ్యకు జబ్బు చేస్తే వైద్యం చేయించారు. వైద్యందారి వైద్యానిది జబ్బుదారి జబ్బుదీ అయింది. "ఏమండి ఏడుకొండలవాడికి మీదుకట్టనా?" అని అడిగింది అమ్మ నాన్నని.

"ఏమో, నీకు తృప్తి కలిగేట్టయితే కట్టు.... దేవుడు లంచాలకు పాల్పడతాడనుకోవడం నాకంత ఇష్టంలేదు" అన్నాడు నాన్న.

జబ్బులో కూడా రాములన్నయ్య, 'దేవుడూలేడు. గీముడూలేడు' అన్నాడు. అమ్మ అంకిళ్ళు నొక్కుకుని, 'నువ్వూరుకోరా, నీ పుణ్యం ఉంటుందీ' అన్నది.

తరువాత రాములన్నయ్యకు నయమయింది. అందరూ కలిసి తిరుపతి వెళ్ళనూ వెళ్ళారు, తిరుపతినుంచి తిరిగివచ్చిన తరువాత వెంకటేశ్వర సమారాధన చేస్తూ బంధువులందర్నీ పిలిచారు. అమ్మమ్మ వచ్చింది కాని అమ్మమ్మ రాలేదు.

"ఆవిడెందుకు వస్తుంది? ఆవిడకు ఏ పోలేరమ్మ జాతరంటేనో ఇష్టంగాని ఆపదమొక్కులవాడంటే సరిపడదులే" అని అమ్మమ్మ చెప్పింది.

అమ్మమ్మకు గ్రామదేవతల్లో నమ్మకం ఉందనివిని అన్నపూర్ణ ఆశ్చర్యపోయింది. ఈమాట వినగానే అమ్మమ్మమీద అన్నపూర్ణకి కొద్దిగా గౌరవం తగ్గింది. అవకాశం దొరికినప్పుడు అమ్మమ్మని అడిగిందికూడా 'ఏం, అమ్మమ్మ నీకు అంకాలమ్మా, పోలేరమ్మా అంటే ఇష్టమేటగా?' అంటే ఆవిడ నవ్వుతూ, 'వాళ్ళు ఊళ్ళో ఎప్పుడూ ఉండేవాళ్ళేగాదుటే? అభిమానం ఉండదూ?' అన్నది.

అమ్మమ్మ అంటే నాన్నకూ్కడా గౌరవమే.

దేవుడిలో నమ్మకం ఉన్నవాళ్ళంతా దేవుడున్నట్టుగా ప్రవర్తిస్తున్నారూ? చాటుగా ఎన్ని వెధవపనులు చెయ్యటం లేదు? దేవుడు చూస్తాడన్న భయం ఉంటే అట్లా చెయ్యగలరా ? ఆ ముసలావిడ దేవుడిపేరు జపం చెయ్యకపోతే ఏం, దేవుడున్నాడన్నట్టే నడుచుకునేది. అదే కావలసింది" ... అనేవాడు నాన్న.

"అమ్మమ్మ నిజమైన భౌతికవాది, ఆవిడకి అవకాశం దొరికితే నామాదిరిగానే ఫిజిక్సు చదివి, రిసర్చిచేసి డాక్టరేట్‌కూడా సంపాదించి ఉండేది. అటువంటి మనిషికి దేవుడిలో నమ్మకం ఉండటానికి వీల్లేదు. డార్విన్ చూడు" అనేవాడు రాములన్నయ్య.

* * *

రాములన్నయ్యకు గొప్ప శాస్త్రవేత్త కావాలనీ ! ఎప్పుడు పడితే అప్పుడు "మా సైంటిస్టులు ఇది ఒప్పుకోరు. అది ఒప్పుకోరు" అంటుంటాడు. ఏవేవో పుస్తకాలు తెచ్చి చదువుతూ ఉంటాడు ! అందులో ఏవైనా బొమ్మలుంటే తన్న

పూర్ణకు చూపించి వాటినిగురించి చెబుతూ ఉంటాడు. అన్నపూర్ణకు అవన్నీ అర్థం కావు.

ఒకసారి రాములన్నయ్య ఒక పుస్తకం తెప్పించి అందులో చంద్రుడి బొమ్మ, ఇంకేవేవో బొమ్మలూ చూపించాడు. అందులో ఒక బొమ్మ దీపావళికి వెలిగించే విష్ణుచక్రమల్లే ఉంది. అయితే గుండ్రంగాలేదు; కోలగాఉంది. అదేమిటంటే అదొక బ్రహ్మాండమన్నాడు. ఇంకో బొమ్మ చూపించి అది అండాండమనీ, మరోబొమ్మ చూపించి పిండాండమనీ అన్నయ్య చెప్పాడు.

"మరీ నువ్వు దేవుడు లేడంటావుగదా ఇవన్నీ ఎవరు చేశారు ?" అన్నది అన్నపూర్ణ.

"వీటిని ఒకరు చేస్తారా ? వాటంతట అవే జరుగుతై, ప్రకృతి నియమం. సూర్యుడిచుట్టూ భూమి తిరుగుచున్నది. ఎవరూ దాన్ని తిప్పక్కర్లేదు. తిరిగే భూమిని ఆపటానికి ఏ భగవంతుడున్నా రావాలి. విత్తులోంచి చెట్టు పుడుతుంది. ప్రకృతి నియమం" అన్నాడు రాములన్నయ్య.

"ఒకవేళ పుట్టకపోతే? అప్పుడు నువ్వూ నేను పాతిపెట్టిన మామిడి టెంక మొలవలేదు. జ్ఞాపకం ఉందా ?" అన్నది అన్నపూర్ణ.

"దానికింకేదో ప్రకృతినియమం అడ్డుపడి ఉండాలి" అన్నాడు రాములన్నయ్య గంభీరంగా.

"ఈ నియమాలన్నీ దేవుడే చేస్తున్నాడేమో ?" అన్నది అన్నపూర్ణ.

"అదే పొరపాటు. దేవుడంటే మనిషి మాదిరిగానే ఉంటాడనీ, ఉంటే రెండు చేతులుంటాయని మనవాళ్ళ ఉద్దేశం. మనకుండే బుద్ధులే దేవుడికీ వుంటాయని మనం అనుకుంటాం. అయితే నీకొక సంగతి తెలుసా? ఒకప్పుడు భూమిమీద మనుషులే లేరు. ఇంకా అంతకుముందు చెట్టూ, చేమలూకూడా లేవు. ఇవాళ సూర్యుడిలో నిప్పు తప్ప ఇంకేమీలేదు. ఒకప్పుడు భూమి మీద కూడా అంతే. అసలు మనుషులే లేక మునుపు మనిషిలాంటి దేవుడుండేవాడని ఎట్లా అనుకోవటం?" అన్నాడు అన్నయ్య.

అన్నపూర్ణకు ఇదంతా రాములన్నయ్య కల్పనే అనిపించింది. కాని మనిషి లేనప్పుడుండిన జంతువులను గురించి అన్నపూర్ణ అన్నయ్యచేత చాలా విషయాలు చెప్పించుకుని విన్నది. ఒకప్పుడు ప్రపంచంలో పెద్దపెద్ద రథాలంతేసి బల్లులుండేవిట. అవి పొడుగాటి తోకలు ఝాడిస్తూ రొచ్చులో గెంతుతూ ఆడుతూ ఉంటే భూకంపం వచ్చినట్టుగా ఉండేదిట. ఈ బల్లుల బొమ్మలు కూడా రాములన్నయ్య తరవాత తెచ్చి చూపించాడు. ఒక్కకూడా లక్ష్యపెట్టకుండా అన్నపూర్ణ ఇంట్లో దీపం ముందరకూచుని ఆ బొమ్మలన్నీ చూచింది.

"ఏమవే, నువు దీపం ఆర్పి బయటకువచ్చి పడుకుంటావా ? నన్ను బయట తాళం వేసుకుని వెళ్ళమన్నావా !" అని అడిగింది అమ్మ. నడివేసవికాలం. అందరూ ఆరుబయట పడుకుంటున్నారు. అన్నపూర్ణ బలవంతాన పుస్తకం మూసి దీపం

ఆర్పేసి బయటికివచ్చి రాములన్నయ్య మంచంపక్కనే తన మంచంమీద పడుకున్నది.

రాములన్నయ్య మేలుకునే ఉన్నాడు. వెల్లకిలాపడుకుని నక్షత్రాలకేసి చూస్తున్నాడు.

"ఆరోజుల్లో సినిమాలుంటే బలే బాగుండేదికాదూ ?" అన్నది అన్నపూర్ణ.

"ఏ రోజుల్లో ?" అన్నాడు రాములన్నయ్య.

"ఆ పెద్ద పెద్ద బల్లులున్న రోజుల్లో, వాటిని ఎవరన్నా సినిమాతీస్తే మనం చక్కగా వాటిని చూచి ఉండేవాళ్ళం" అన్నది అన్నపూర్ణ.

"అప్పటికి మనుషులే లేరు. కామెరాలు లేవు. ఫిల్ము లేదు. అందాకా ఎందుకు ? అమ్మమ్మా వాళ్ళనాన్న సినిమా చూచి ఉండరు" అన్నాడు రాములన్నయ్య. అతను కాస్సేపుండి, "ఆ కనబడే నక్షత్రాల మధ్య మన భూమి వంటిది ఉండి, అందులో మనుషులున్నారనుకో, వాళ్ళు భూమికేసి టెలిస్కోపులతో చూస్తే భూమిమీద ఆ బల్లులు కదులుతూ కనపడవచ్చు" అన్నాడు.

అన్నపూర్ణ అర్థం చేసుకున్నది. ఆ నక్షత్రాలనుంచి కాంతి మనదాకా రావటానికి ఒక్కొక్కసారి కోట్లకొద్దీ సంవత్సరాలు పడుతుందిట. అంత దూరం నుంచి టెలిస్కోపులతో ఈ భూమిమీద జరిగేది చూడటం అసంభవం. ఆ సంగతి రాములన్నయ్యకు తెలుసు. అయినా అన్నపూర్ణను తృప్తిచెయ్యటానికి అతను అట్లా చెప్పాడు. జనసామాన్యం కోసం శాస్త్రవిషయాలు రాసేవారి లక్షణాలు రాములన్నయ్యలో కొన్ని లేకపోలేదు.

"ఏ నక్షత్రంలోనుంచన్నా చూస్తే అమ్మమ్మ చిన్నపిల్లగా ఇప్పుడు కనిపిస్తుందా ?" అని అడిగింది అన్నపూర్ణ.

"ఓ !" అన్నాడు రాములన్నయ్య.

అన్నపూర్ణ కళ్ళు మూసుకుని కాస్సేపట్లో నిద్రపోయింది. ఆమెకు కలలో పెద్ద పెద్ద బల్లులు గెంతుతూ కనిపించాయి. అందులో ఒక బల్లి మెడ చాచుకుని అన్నపూర్ణవేపు వచ్చింది. దగ్గిరగా చూస్తే దాని ముఖం అమ్మమ్మ ముఖంలాగే ఉంది.

* * *

అన్నపూర్ణ స్కూలు ఫైనల్ పరీక్షల బరువు దించేసుకున్నది. ఈ పరీక్షలో పాసయినా, తప్పినా ఇక మరి చదువు లేదు. అప్పుడే ఆమె జీవితంలో ఒక యుగం అయిపోయి ఇంకో యుగం ప్రారంభం కాబోతున్నది. పెద్దవాళ్ళు సంబంధాలు చూస్తున్నారు.

అన్నపూర్ణకు సంబంధం చూడాలంటే అట్టే దూరం పోనవసరంలేదు. బంధువుల బలగం చాలా ఉంది. అన్నపూర్ణకు ఈడయినవాళ్ళు ముగ్గురు నలుగురున్నారు. వాళ్ళలో ఎవరా అనేది తేల్చుకుంటే మూడు ముళ్ళూ క్షణంలో పడిపోతై. వాళ్ళ

కూడా నలుగురూ నాలుగు రకాలు. ఒకడికి చదువూ, తెలివీ ఉన్నాయి. ఒకడు అన్నపూర్ణకు ఈడూజోడూగా ఉంటాడు. ఒకడికి కాస్త మంచి ఆస్తి ఉంది. ఏ ఒకర్ని చేసుకున్నా మిగిలినవాళ్ళు కాస్త గునుస్తారు. ఎందుకంటే అన్నపూర్ణ చక్కనిపిల్ల. ఇంత బలగంలోనూ కనుముక్కుతీరు పిల్లలు ఏ ఇద్దరు ముగ్గురో మాత్రమే ఉన్నారు. ఎవరూ నొచ్చుకోకుండా ఏదో ఒక సంబంధం నిశ్చయించటానికి చర్చలు సాగుతున్నై.

రాములన్నయ్యకు ఈ సంబంధాలలో ఒకటీ నచ్చలేదు. నిజానికి అన్నపూర్ణకు కూడా ఏ సంబంధమూ నచ్చలేదు. కాని సంబంధం విషయంలో తల్లిదండ్రులు చెప్పినట్టు రాజీపడదామనుకుంది. కాని రాములన్నయ్య తన అభిప్రాయం చెప్పిన మీదట అన్నపూర్ణకికూడా ఈ సంబంధాలను తోసెయ్యాలనిపించింది.

అందరూ భోంచేస్తున్న సమయంలో నాన్న రాములన్నయ్యతో, "ఏరా? అమ్మడికి ఎవరిని చేస్తే బాగుంటుందంటావు? సీతాపతి మంచి ఉద్యోగంలో ఉన్నాడు. సుబ్బారావుకు ఆస్తి ఉంది. లక్ష్మీకాంతం చూట్టానికి బాగుంటాడు" అన్నాడు.

రాములన్నయ్య వెంటనే సమాధానం చెప్పలేదు. అతను కాస్సేపుండి మాట్లాడటం మొదలుపెడితే అన్నపూర్ణ ఇంకేదో విషయం మాట్లాడుతున్నాడనుకుంది.

"పూర్వం కోతులు అడివిచెట్లమీదే ఉండేవి. నేలమీదికి దిగివచ్చేవికావు. అవి ఉండే చెట్లచుట్టూ రింగులాగా చెట్లు కొట్టేస్తే వాటిపని ఖైదులో ఉన్నట్టయి పోయేది. మన సంగతి అట్లాగే ఉంది. ఇంత ప్రపంచం ఉంది. రైళ్ళూ రేడియోలు ఉన్నై. ఉద్యోగాల కోసం జనం వేలకొద్దీ మైళ్ళు పోతున్నారు. మనం అమ్మడికి మొగుణ్ణి వెతకాలంటే మన మురికిగుంటలోనే వెతకాలి!" అన్నాడు రాములన్నయ్య.

"అయితే ఇంకేం, నువు మంచి సంబంధం తీసుకురా" అన్నాడు నాన్న.

"నాకోసం వస్తాడే సుదర్శనం? వాడికిచ్చి చెయ్యండి" అన్నాడు అన్నయ్య.

"వాళ్ళు మన శాఖకాదే!" అన్నాడు నాన్న.

"ఏం శాఖో, ఏట్లోశాఖ. మా సైంటిస్టులకు ఈ శాఖల్లో నమ్మకంలేదు. ఒకప్పుడు మన పూర్వీకులు చెట్లమీద ఉండేవాళ్ళు. ఇంకా అంతకు పూర్వం మడుగుల్లో ఉండేవాళ్ళు. ఇంకా పూర్వం నీళ్ళల్లో ఉండేవాళ్ళు. మనం ఏశాఖ?" అన్నాడు రాములన్నయ్య ఉపన్యసించేవాడల్లే.

ఆ ప్రస్తావన అక్కడితో ముగిసింది.

ఆ సాయంకాలం అన్నపూర్ణ, వసారాలో కూచుని జడవేసుకుంటుండగా ఒక ముసలివాడు వచ్చాడు. మోకాళ్ళదాకా ఒక కొల్లాయిగుడ్డ కట్టుకున్నాడు. పైన ఇంకో కొల్లాయిగుడ్డ వేసుకున్నాడు. చంకలో ఏదో మూట ఉన్నది. పుస్తకంలో చూచిన జవాను మనిషిమల్లే కనిపించాడు అన్నపూర్ణకు.

"మహాలక్ష్మి ఉందిటరా ?" అన్నాడాయన అన్నపూర్ణకేసి చూడకుండా దిక్కులు చూస్తూ.

"అమ్మా" అని కేకవేసింది అన్నపూర్ణ. అమ్మ లోపల్నుంచి వచ్చి "నువ్వా, తాతయ్యా ? రా రా, ఎప్పుడు రావటం!" అంటూ అమ్మ ఆయన్ని పరామర్శించింది.

ఆయన అమ్మమ్మ ఆఖరు తమ్ముడట. అమ్మ చెప్పింది. ఆ రాత్రి అమ్మ ఆయనకోసం మడికట్టుకుని వంట చేస్తుంటే చూస్తే అన్నపూర్ణకు ఏనక్షత్రం నుంచో చూస్తున్నట్టుగా కనిపించింది. నాన్నకోసం అమ్మ ఎప్పుడూ మడి కట్టుకోదు.

భోజనాల దగ్గిర అన్నపూర్ణ పెళ్ళి విషయం వచ్చింది.

"ఇది అచ్చు మా అన్నపూర్ణక్కయే. దాన్ని అడక్కుండా ఏ సంబంధమూ చెయ్యకండి. మా అన్నపూర్ణమ్మ కిట్టాగే చిన్నప్పుడు మా నాన్న సంబంధం ఏదో చూస్తే చెప్పకుండా ఇంటినుంచి బయలుదేరిపోయింది" అన్నాడు జావా మనిషి.

ఈ మాట వింటూంటే అన్నపూర్ణకు అమ్మమ్మమీద ఎక్కడలేని గౌరవమూ వచ్చింది. తన కిష్టంలేని సంబంధం చేస్తే తానుకూడా అమ్మమ్మలాగే ఇంట్లోనుంచి వెళ్ళిపోదామనుకుంది అన్నపూర్ణ.

ముద్రణ :

ప్రచురణ : కొడవటిగంటి కుటుంబరావు కథల సంపుటిలో,

జయా పబ్లికేషన్స్ : విజయవాడ.